
కొరుకొండ సత్యానంద్

# వైతరణీ తీరం



ఆ విశాలమైన మైదానంలో.. ఇసుక రాలని జనసందోహ మధ్యంలో.. ఒక పెద్ద స్టేజి ఉంది అది ఎందరి చేతో నేర్పుగా, ఓర్పుతో వసంతకాల మందు విరియు ఎన్నోరకాల పుష్పాలతో అల్లిన మాలలా ఉంది .

ఆ స్టేజిమీద ఆకాశం మీద నుండి తెగి రాలిన నక్షత్రాల గుంపు ఉంది.. వెలుగుల జిలుగులు, వెన్నెల కాంతులు, అందమైన ఆనందాలు ఎందరో అనుకునే అదృష్టవంతమైన జీవితాలు — వంపులు, సొంపులు, నవ్వులు, కేరింతలు .ఎన్నో ఉన్నాయి అక్కడ..

అవి అందర్నీ ఆకర్షిస్తున్నాయి. అందరినీ ఆనందపరుస్తున్నాయి ఎందర్నో తృప్తిపరుస్తున్నాయి. ఎందరి కళ్ళకో ఎప్పుడూ చూడని స్వర్గాన్ని చూపిస్తున్నాయి-

ఆ స్టేజిమీద అందరికీ మధ్య 'మయూరి' ఉంది ఆమె ఎంతో ఆనందంగా ఉంది అందంగా నవ్వుతూ ఉంది మయూరిని మించిన వయ్యారంగా ఉంది లతను మించిన లలితంగా ఉంది. అంతమంది తారల మధ్య తారలకు తారలా ఉంది

ఈ రోజు, ఆ ఆనందం ఆ హడావుడి ఆమెకోసం ప్రత్యేకింపబడి ఉంది; ఈ జనసందోహం ఎందరో నటీనటులు, సినీపరిశ్రమ ప్రముఖులు ఇతర రంగాల లోని ప్రముఖులు ఆమెకోసం ప్రత్యేకించి పనుల ఒత్తిడిని ప్రక్కనపెట్టి వచ్చారు

కారణం ఈరోజు మయూరికి, ఆమెలోని నటీమణికి, ఒక అందమైన బిరుదును, గుర్తింపును ఇస్తున్నారు కళ

అనే రాచవీధిలో ఆమెకో అందమైన భవనాన్ని బహూకరిస్తున్నారు

అది ఆమె అదృష్టం అని ఎవ్వరూ అనుకోవడంలేదు అందరూ అనుకునేది 'అది ఆమె ఓర్పుకు, నేర్పుకు, చాకచక్యానికి, చక్కని నటనా ప్రదర్శనకు అందిన బహుమానం, ప్రతిఫలం' అని।

అందరి కళ్ళూ ఆమెపై పే వసంత కళ్ళతో సహా।

అందరూ ఆకర్షింపబడుతున్నారు . వసంత కళ్ళతో సహా।

కానీ .అందరూ అలా ఆలోచించడం లేదేమో ఒక్క వసంత తప్ప।

ఆమె ఆలోచిస్తున్నది అర్థంలేనిదని, అది పిచ్చి ఆలోచన అని ఆమె అనుకోవడంలేదు అందుకే పదే పదే అలా ఆలోచిస్తుంది ఆలోచిస్తూ అప్పుడప్పుడూ ఆశపడుతుంది-తన ఆశ దురాశ కాదని, తనకది నిరాశగా మిగిలిపోదని అనుకుంటుంది

ఆ ఆలోచనల్లో, ఆ ఆశలో కొన్ని ప్రశ్నలు పుట్టుకొస్తున్నాయి, అవి వెటకారంగా పలకరిస్తున్నాయి

మయూరిని ఘనంగా సన్మానించారు ఎందరో అభినందించారు ..అందమైన బిరుదును ఇచ్చి, ఆమె తలమీద తళతళ మెరిసే కిరీటాన్ని పెట్టారు ఆమెను పొగుడుతూ ఎందరో మాట్లాడారు. అభిమానాన్ని కురిపించారు .

ఆఖర్న మయూరి మాట్లాడింది

"పదహారేళ్ళ ప్రాయంలోనే నేను పరిశ్రమలోకి అడుగుపెట్టాను. కళామతల్లి నన్ను ప్రేమగా కౌగిలించుకుంది ఎందరో మహానుభావులు నన్ను సాదరంగా ఆహ్వానించారు. రసజ్ఞులు ఆదరించి నటిగా గుర్తించారు ప్రోత్సహించారు ఇన్నాళ్ళూ నేను ఎలా నటించానో, ఎందుకు నటించానో గానీ ఈ రోజునుండీ నేను నాకు మీ రిచ్చిన .ఈ బిరుదును గుర్తుకుతెచ్చుకుంటూ మీకోసం నటించాలి—అందుకు కావాల్సిన శక్తి యుక్తులు ఆ దేవుడు నాకు ప్రసాదించాలని కోరుకుంటున్నాను నన్ను ఇంతగా అభిమానించి, గౌరవించిన ప్రతివారికీ జీవితాంతం ఋణపడి ఉంటాను."

జనసందోహంలో కలకలం అరుపులు, కేకలు, ఈలలు ఎన్నో పూలదండలు స్టేజిమీదకు వచ్చిపడ్డాయి అవన్నీ అభిమానానికి ప్రతీకలు

ఆ అభిమానానికి మయూరి శరీరం జలదరించిపోయింది ఆ అభిమానపు వెల్లువకు ఆమె మనసు మురిసిపోయింది

వసంత మౌనంగా చూస్తూ ఉండిపోయింది

♦ ♦ ♦

గడియారం పన్నెండు గంటలు కొట్టింది...

వసంత నిద్రపోలేదు.. ఆమెకు నిద్రరావడంలేదు. మయూరి సన్మాన సభలో వసంతను చుట్టుకొని ఆటపట్టిం

చిన ఆ వింత ఆలోచనల పరంపరలు ఆమెను ఇంకా వదలిపెట్టి పోలేదు

వసంతలో ఆ ఆలోచనలు మయూరి నటిగా ఎదుగుతున్నప్పటి నుండీ ఎదుగుతూనే వచ్చాయి. సినిమాలో మయూరిని చూసినా, ఎక్కడైనా మయూరి ఫోటో కన్పించినా, తలపులోనికి ఆమె వచ్చినా, వసంతలో ఆ ఆలోచనలు ఛెలరేగుతాయి

అది ఆమె బలహీనతో పొరపాటో, పడబోతున్న తప్పటడుగో, రాబోతున్న వింత మలుపో వసంత ఎప్పుడూ ఆలోచించలేదు ..ఆమెకు ఆ ఆలోచనలు తప్ప మరింకే ఆలోచనలూ రావు

అవే ఆమెను పిచ్చిదానిగా చేస్తున్నాయి అవే ఆమెను విపరీతంగా ఆట పట్టిస్తున్నాయి అవే ఆమెలో క్రమంగా పాతుకుపోతున్నాయి

ఆ గదిలో నాలుగు మూలలా ఫోటోలే! కానీ వసంతకు మయూరి అంటే ఇష్టం ఉండదు... ఆమెకు ఇష్టమైనది తన టేబుల్ మీద ఉన్న ఫోటోయే!

ఆ ఫోటో . వసంతదే

వసంత వసంతమంత అందంగా ఉంటుంది

వసంత కాలమంత ఆహ్లాదంగా ఉంటుంది

గలగలా పారుతున్న యేరులా నవ్వుతుంది

వేసవి వెన్నెల రాత్రిలో విరిసిన మల్లెపూవులా గుభాళిస్తుంది..

అని వసంతను చూసినవాళ్ళెవరైనా అంటారు వసంత కూడా అలాగే అనుకుంటుంది ఆ గదిలోకి వచ్చినవాళ్ళందరూ ఆ ఫోటోల్ని చూసి మయూరి కంటే వసంతే అందమైనదని అనుకోవాలని అనుకుంటుంది

వసంత మధ్యతరగతి కుటుంబంలో పుట్టింది ఆమె మనసు కూడా మధ్యతరగతిదే! అందుకేనేమో అది ప్రతి ఆలోచనకు, ప్రతి సంఘటనకూ రెపరెపలాడుతుంది

నటిగా తప్ప మయూరి గురించి వసంతకు ఏమీ తెలియదు. తెరమీద తప్ప బయట ఎప్పుడూ మయూరిని చూడలేదు అప్పుడు తప్ప'

ఈ కొద్దిరోజుల్లో మయూరి మీద వసంతకున్న అయిష్టం ఈర్ష్యగా మారిపోయింది దానికి కారణం వసంత అప్పుడు మయూరిని అతి దగ్గరగా చూసింది . ఆ కొద్దికాలంలోనే ఆడదానిగా అందులోనూ అందమున్న ఆడదానిగా ఎదుటనున్న ఆడదానిలోని అందాన్ని ఇట్టే కొలిచేసింది.

అందుకే ఆమెలోని అయిష్టం ఈర్ష్యగా మారిపోయింది

వసంతకు మయూరి మీదున్న అయిష్టంలోంచి ఆలోచనలు ఆ ఆలోచనల్లోంచి ఈర్ష్య, ఆ ఈర్ష్యలోంచి ఎన్నో ప్రశ్నలు పుట్టుకొస్తున్నాయి

అందుకే ఆలోచించీ, ఆలోచించీ.. అలసిపోయి ఇక ఆలోచించలేక ఆ ఆలోచనలను, ప్రశ్నలను ఒక కాగితం మీద పెట్టింది..

♦ ♦ ♦

'మయూరిగార్కి నమస్తే!

'నా పేరు వసంత. ఈ ఉత్తరం పూర్తిగా చదమని కోరుతూ, ఈ ఉత్తరం లోని మాటలు మిమ్మల్ని కించపరుస్తున్నట్టు అన్పిస్తే నన్ను మన్నిస్తారని ఆశిస్తున్నాను

'ఈ ఉత్తరంతో పాటుగా మీకో ఫోటోను పంపాను చూడండి .


' చూసారు కదూ!? దాన్ని చూస్తే మీకేమన్పించింది...? 'ఈ అమ్మాయి చాలా చాగుంది'... అని అన్పించింది కదూ!? ఆ ఫోటో నాదే! నేను బయట కూడా అచ్చం అలాగే, అంతకంటె బాగుంటాను. ఆ ఫోటో ఒక మామూలు కెమెరాతో తీసింది ఇంకా ఖరీదైన కెమేరాతో, ఇంకా మంచి కెమేరామన్ తీస్తే ఇంకా బాగుంటుంది . కారణం, నేను చాలా అందంగా ఉంటాను. అంటే మీకంటే చాలా బాగుంటాను మీలా రకరకాల కాస్మటిక్స్ రాసుకొని గానీ, బ్యూటీ సెలూన్ కి వెళ్ళిగానీ, లేక మేకప్ చేసుకొనిగానీ తీయించుకున్న ఫోటో కాదది మామూలు పౌడరు రాసుకొని తీయించుకున్న ఫోటో అది- ఫుల్ మేకప్‌లో అయితే ఇంకెంత బాగుంటానో మీరే ఊహించుకోండి

ఇలా వ్రాస్తున్నానని కోపం తెచ్చుకొని ఉత్తరం చదవడం ఆపేయడం కాని, చించి చెత్తబుట్టలో పడేయడంగానీ చేయరని ఆశిస్తున్నాను.

'మీరు అందంగా ఉంటారు నేను చాలా అందంగా ఉంటాను మీ పర్సనాలిటీ చాలా బాగుంటుంది... కానీ వయసు ఎక్కువ వారిగా సినిమాలోనే కన్పిస్తారు.. ఇంక బయట (మొన్న మీకు సన్మానం జరిగినప్పుడు చూసాన్లెండి ..!) మరీ పెద్దగా కన్పిస్తారు...

'ఇంత ఖచ్చితంగా వ్రాస్తున్నానని ఏమీ అనుకోకండి! నాకు కొన్ని అనుమానా లున్నాయి . అవి నా ఆసక్తికి ఆటంకంగా ఉన్నాయి . నిజానికి నాకు రావల్సిన అదృష్టానికి నాకున్న అనుమానాలు, సందేహాలు నివృత్తికాకుండా అడ్డొస్తున్నాయి నా బంగారు భవిష్యత్తుకు ఆ దేవుడు వరం ఇచ్చినా, ఆ బంగారు భవిష్యత్తుకు దారిని వెతుక్కోలేక పోతున్నాను ... అది ఎటుందో కనుక్కోలేకపోతున్నాను అందుకే నేనీ ఉత్తరం రాయడం జరిగింది

' సినిమాల్లో నటించడానికి అందం, నటనా చాతుర్యం ఉండాలి-నేను నటనను సినిమాల్లో చేరింతర్వాతే నేర్చుకున్నాను . ప్రతిభ గల దర్శకుడు, సాంకేతిక నిపుణుల చేతుల్లో ఉత్సాహం




ఉన్న నటి లేదా నటుడు సానపట్టిన కత్తిలా వాడిగా తయారౌతారు నటనను నేర్చుకోవాలన్నా నటీమణిగా రాణించాలన్నా అన్నింటికంటే ముందు అవకాశం రావాలి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగ పరచుకొని తమ ప్రతిభను నిరూపించుకోవాలి !' అని మీరోసారి ఓ సినిమా ప్రతికలో వ్రాసారు .

'అంటే, అందంగా ఉంటే చాలు సినిమా నటులైపోవచ్చు, అవకాశం వస్తే, ఆ తర్వాత నటన నేర్చుకోవచ్చు అని మీ అనుభవాన్నే ఉదాహరణగా చెప్పారు.

'నాకు అందం ఉంది... ఉత్సాహం ఉంది అవకాశం వస్తే నటించగలను రాణించగలను కూడా' ఆ నమ్మకం నాకుంది. కానీ, ఈ విషయంలో నాకెన్నో అనుమానాలున్నాయి

'సినిమా నటి అవకాశం ఎలా వస్తుంది? ఏం చేస్తే వస్తుంది? ఎవర్ని సంప్రదిస్తే వస్తుంది?

దయచేసి నా విషయాన్ని నిర్లక్ష్యం చేయకుండా \ ఈ విషయాలు తెలియజేస్తారని ఆశిస్తున్నాను. .

నేను ఇంటర్ వరకూ చదువుకున్నాను . అన్ని నవలలూ ఎలాగైనా సంపాదించి చదువుతాను అన్ని సినిమా పత్రికలూ చూస్తాను అన్ని సినిమాలు తప్పక చూస్తాను స్వచ్ఛంగా మాట్లాడగలను ' చూసిన సిన్మాలోని డైలాగుల్ని ఇంటిదగ్గర అచ్చం అలాగే మాట్లాడుకుంటాను. అద్దం ముందు చక్కగా అభినయించగలను మాది పెద్ద సిటీ కాదు . నా అదృష్టం బాగుంది మీకు సన్మానం జరుగుతున్న సమయానికి నేను ఆ ఊర్లోనే మా బాబాయిగారి ఇంటి దగ్గర ఉన్నాను కాబట్టి మిమల్ని చూడగలిగాను

మానవ ప్రయత్నం లేకుండా ఏదీ జరగదు అంటారు అందుకే, తొలి ప్రయత్నంగా మీకీ ఉత్తరాన్ని వ్రాసాను. నన్ను మీ సోదరిగా

భావించి, నా ఉత్తరంలో తప్పులుంటే మన్నించి, మీకు తెలిసిన సినీ ప్రముఖులకు నా ఫోటో చూపించి, నాకు సినిమాలో ఏ పాత్ర అయినా నటించే అవకాశం కల్పిస్తారని ఆశిస్తున్నాను

'నటిగా ఎంతో పేరున్న మీరు తలచుకుంటే రికమెండ్ చేసి నన్ను నటిగా తయారు చేయగలరన్న నమ్మకం నాకుంది నన్ను ఎక్కడికి రమ్మంటే అక్కడికి, ఎప్పుడు రమ్మంటే అప్పుడు వస్తాను .మీ దీవెనలతో సాగరంలాంటి సినిమా పరిశ్రమలో చిన్న స్థానాన్ని సంపాదించుకుంటాను ..ఈ ఉత్తరంతో పాటుగా నా అడ్రసు ఉన్న కవర్ని పంపుతున్నాను అందులో మీకు వీలైనంత తొందరగా నాకు సమాధానం వ్రాస్తారని ఆశిస్తున్నాను .

'మీ నుండి ఉత్తరం వచ్చిన వెంటనే పంపమంటే నా ఫోటో ఆల్బమ్ పంపగలను .

ఉంటాను.

మీ ఉత్తరం కోసం వేయికళ్ళతో
ఎదురు చూసే
మీ సోదరి
వసంత. '

• • •

'వసంతకు. .మయూరి వ్రాయునది-

నిన్ను నా సోదరిగా భావించి బహువచన ప్రయోగం చేయలేదు ఏమీ అనుకోకమ్మా! నీ ఉత్తరం అందింది-చదివాను, చాలాసార్లు నీ ఫోటో చూసాను. ఎంతోసేపు.. నీ ఉత్తరం చదివి నిన్ను 'పిచ్చిపిల్ల' అనుకున్నాను నీ ఫోటో చూసి 'చిన్నపిల్ల' అనుకున్నాను ఇలా వ్రాసానని ఏమీ అనుకోవద్దమ్మా?!

'నువ్వు ఎంతో అందంగా ఉన్నావమ్మా! ఈమాట నేనేకాదు, నీ ఫోటోను చూసినవాళ్ళు ఎవరైనా అలాగే అంటారు కారణం, నువ్వు చాలా అందముగా ఉన్నావు కనుక! నీ ఉత్తరం చదివి నన్ను నువ్వు కించపరుస్తున్నావని అనుకోలేదు నీమీద నాకు ఎలాంటి కోపమూ లేదు కారణం, నీ రాతలో అమాయకత్వం ఉంది, నీ పదాల పొందికలో వికసించీ-వికసించని నీ మనసు కన్పిస్తుంది... నువ్వడిగిన ప్రశ్నల్లో నువ్వెంతగా నీకేమీ తెలియనిదానికి ఆకర్షింపబడుతున్నావో తెలుస్తుంది

వసంతా! నువ్వడిగినవి ప్రశ్నలే గానీ, నేను చెప్తున్నది సమాధానం కాదమ్మా, జీవితం! కారణం, నీ ఊహ, నీ ఆశ, నీ కోరిక ఇవన్నీ జీవితాన్ని తారుమారుచేసే ఆకర్షణ అనే దీపం చుట్టూచేరిన పురుగుల్లా అనిపిస్తున్నాయి. నాకు, చెప్పలేం,అవి నాశనమైపోవచ్చు, జీవితాన్ని నిస్సారం చెయ్యొచ్చు

పుస్తకాల్లో నేను రాసినవి నిజాలు కావమ్మా! నిజం కన్పించకుండా వేసుకున్న ముసుగులు, విలువను, ఆకర్షణను పెంచుకోవాలని చేసిన ప్రయత్నాలు

అవి ఇక్కడ అవసరం అమ్మా! నా మటుకు నేను ఈ జీవితాన్ని, ఈ పరిస్థితుల్ని అసహ్యించుకుంటున్నాను... అయినా విదిలించుకోలేను, వదిలించుకోలేను అలా చేస్తే ఆడదానికి ఉండాల్సిన జీవితమూ చెంతకు రాదు, ఉన్న యీ పై మెరుగులు, మెప్పులు కూడా ఉండకుండా మనిషినే పరిస్థితులు మసిచేస్తాయి

రొంపులో సెంటుసీసాలు వొంపుకొని బ్రతుకుతున్నానేమో ననిపిస్తుంది నాకు అప్పుడప్పుడూ కారణం

నీకు తెలియాలంటే టూకీగా నా గురించి చెప్పుకోవాలి

నీవు చదివే ఉంటావు, నేను నాజీవిత కథను వ్రాస్తున్నాను అది అంతా నిజం కాదు అయితే అబద్ధం ఎందుకు రాశారని నువ్వడగొచ్చు- అలా ఎందుకు వ్రాసానంటే నిజాలు వ్రాయలేనివి, వ్రాయకూడనివి కనుక!

ఇకపోతే నీ ముఖ్యమైన ప్రశ్న 'మీరు ఈ పరిశ్రమలోకి ఎలా వచ్చారు?' కు సమాధానం మూడుముక్కల్లో చెప్తా.

అందంగా ఉన్నాను అవకాశం వచ్చింది. ఇచ్చిన ప్రోత్సాహంతో నేను నా నటనాశక్తిని నిరూపించుకున్నాను

సూటిగా చెప్తే జవాబు అదే! అంతే! వెరీ సింపుల్! కానీ విడమరిచి చెప్తే, వివరించి తెలిపితే

అది జవాబు అవ్వదు జీవితం ఆకర్షణ ఊబిలోకి దిగిపోతున్న దృశ్యం అవుతుంది. ఆడది ఎదుటివారు తనమీద మోజును పెంచుకొనేలా చేస్తే, ఆమె అందరూ అందుకోలేని స్థానాలు అందుకుంటూ, మనిషిగా ఎంత క్రిందకి దిగజారిపోతుందో చూపించాలంటే అది నేర్పుగల చిత్రకారుని ప్రతిభకు పరీక్ష పెట్టే చిత్రమౌతుంది అది నిజాన్ని పైకిలాగే పలుగు అవుతుంది.

సారీ, నన్ను నేను కంట్రోల్ చేసుకోలేకపోతున్నాను-

ఇది సరిగా వివరించి చెప్పలేని విషమ పరిస్థితి .ఆలోచనలతో మెదడును, మనసును ముద్దచేసేసే దారుణ దుస్థితి.

అయినా వ్రాస్తాను చదివి నువ్వు నన్ను అసహ్యించుకున్నా ఫరవాలేదు, వ్రాస్తాను.

నేనూ మధ్యతరగతి కుటుంబంలోనే పుట్టాను నీలాగే కొద్దిగా చదువుకున్నాను .. అందంగానే ఉండేదాన్ని మా దూరపుబంధువు ఒకాయన తనకు సినీ పరిశ్రమలో ఎవరో తెలుసన్నాడు. నన్ను తన దగ్గరకు తీసుకెళ్తానన్నాడు

నేను కాదనలేదు నా ముసలి తల్లి, తండ్రీ కూడా కాదనలేదు కారణం, నా మనసులో ఆశ పెల్లుబికింది-నా తల్లిదండ్రులకు బలమైన చేయూత నౌతానేమో అన్పించింది వాళ్ళకు నాకు అతనిపై నమ్మకం ఏర్పడింది

అతనితో కలిసి వెళ్ళాను ఈడు కుదిరినవాడితో కలిసి నడవడం అదే మొదటిసారి

'అది' కూడా అదే మొదటిసారి— కుమారిగా ఉండగానే కన్యపీఠాన్ని పోగొట్టుకోవడం. అప్పుడు నేను బాధ పడలేదు—మనసు మాత్రం అదోలా అయ్యింది. అతని మాటలు, నవ్వులు, రేపిన ఆశలు మనసును మామూలుగా చేసాయి అసలు ఏమీ జరగనట్లుగానే ఉండగలిగేను అప్పట్నుంచీ! ఏది జరిగినా, ఎంత జరిగినా, ఎంతకు మునిగిపోయినా, ఎంత క్రిందకు దిగజారిపోయినా, జీవితంలో మళ్ళీ లేవలేనంతగా జారిపోయినా, మళ్ళీ తిరిగి తెచ్చుకో లేనిది కోల్పోయినా...ఏమీ జరగనట్లు ఉండడమే నా కలవాటయ్యిందమ్మా.

నేను నటించిన మొదటిసన్నివేశంలో ఒక అందగాడు, నా కాలి! తళుక్కుమంటున్న అందె కడతాడు కాలికి అందె కట్టించుకొనే ఆ సన్నివేశంలో నటించడానికి ముందు రాత్రి నేను ఒక ప్రఖ్యాత వ్యక్తి దగ్గ నా కాలును కాస్త ప్రక్కకు . రపవలసి వచ్చింది.

ఈ వాక్యంలోని అసభ్యాన్ని ఇంత కంటే తగ్గించి వ్రాయలేకపోతున్నాను వసంతా!

అలా వచ్చిందమ్మా అవకాశం ఆ తరువాత ఎంతో ప్రోత్సాహం ఇచ్చారు ఎందరో, నా దగ్గర వాళ్ళకు నచ్చింది తీసుకొని

వయసెదుగుతుంటే నేను గమనిస్తున్న పరిసరాలు, పరిస్థితులు నా గుండెను బరువెక్కిస్తుంటే ఎంత బరువు గల పాత్రనయినా పోషించేయడం అలవాటయిపోయింది నాకు

నేను అంటే కోపం వస్తుందేమో గానీ, ఈ ప్రేక్షకులు ఎంత అమాయకులో అని అన్పిస్తుంది నాకు. తెల్లని తెరమీద నా ఒంపుసొంపుల రంగుల పొంగులను చూసి ఆనందపడిపోతూ, కళ్ళపై నుండి రాలుతున్న కన్నీళ్ళను చూసి గుండెల్లోంచి కన్నీరు కారుస్తూ, కన్పించేదంతా ఖచ్చితమైన కళే అనుకుంటున్నందుకు నాలాంటిదానికి వాళ్ళ అభిమాన సంపదను అందిస్తున్నందుకు నీరాజనాలు అర్పిస్తున్నందుకు..!

కాదు! వాళ్ళు అమాయకులని పొరపాటున అన్నాను వాళ్ళు నా దగ్గం మోసపోతున్నారు వాళ్ళను నేను మోసం చేస్తున్నాను- పవిత్రతలేని నేను పవిత్రమైనదానిలా ప్రశాంతంగా ముఖాన్ని పెట్టి నటించి శీలంలేని నేను శీలవతిగా, అభిమానంలేని నేను అభిమానవతిగా నటిస్తూ వాళ్ళను నేను మోసంచేస్తున్నాను

వసంతా! సెంటిమెంట్స్ మీద నీకు నమ్మకం ఉందా? ఇది సెంటిమెంట్ల సినిమాలను సృష్టించే పరిశ్రమ అయినా ఇక్కడ ఎవ్వరికీ సెంటిమెంటు అన్నది ఉండదమ్మా! ఉండకూడదు కూడా.



నీ కిదంతా వివరంగా వ్రాస్తున్నది ఎందుకో తెలుసా వసంతా? నీ ఆసక్తికి ఆటంకంగా ఉన్న అనుమానాలు వెనుక లేని మానాభిమానాలను 'వివరించడానికి, ఈ ప్రపంచంలోకి నీవు అడుగుపెడితే నీ భవిష్యత్తు బంగారు భవిష్యత్తు కాక పోవచ్చేమోనని తెలియజేయడానికి మాత్రమే నమ్మా! '

సినిమాల్లో ఎలా చేరాలి? అన్న నీ ప్రశ్నకు నా అనుభవాన్ని సమాధానంగా సలహాగా చెప్పాను గానీ, సినిమాల్లో నటిస్తున్న వారందరకూ, సినిమాల్లో క్రొత్తగా చేరుతున్న వారందరకూ నాకెదురైన అనుభవాలే ఎదురయ్యాయని, ఎదురౌతాయని చెప్పడం నా అభిమతం కాదు...

ఇక్కడ అనేక రకాల రంగులూ, అనేక రకాల కదలికలు, ప్రవర్తనలు...

ఏ జీవితానికి ఏది అందుతుందో ఏది దొరుకుతుందో ఎవరూ చెప్పలేరు

ఈ జీవితం అదృష్టవంతమైన దురదృష్టం దురదృష్టమైన అదృష్టం।

ఇక్కడ అందరూ ఒక విచిత్రమైన ఆట ఆడుతూ ఉంటారు కొందరు మొదటే ఓడిపోవచ్చు మరి కొందరు మధ్యలో ఓడిపోవచ్చు చాలా కొద్దిమంది ఆఖరువరకూ ఆడగలగొచ్చు ఓడిపోయిన వాళ్ళు వెళ్ళేది అగాధంలోకి। ఆఖరువరకూ ఆడుతున్న వాళ్ళు కూడా అలసిపోయినా ఆట ఆపగూడదు

నేనీ జీవితంతో రాజీ పడిపోయాను నాకున్న పరిస్థితుల్లో నేను ఆడలేను ఆట ఆపలేను

నా కెందరో అభిమానులున్నారుగానీ నటిగా గాక ఒక ఆడదానిగా నా డబ్బుని చూసిగాక ఒక భార్యగా నన్ను దగ్గరకు చేర్చుకొనేవారు లేరు ఉన్న తల్లి దండ్రులూ పోయారు ఉన్నాడని కొందరికే చెప్పుకోడానికి ఉన్నవాడు ఆ రోజు నన్ను ఈ ప్రపంచంలోకి ఈడ్చినవాడు నా పరిస్థితులను బట్టి అతన్ని నేను పెళ్లి చేసుకోగూడదు నేను చేసుకుందామన్న అతను నన్ను చేసుకోడు। అప్పుడప్పుడూ తప్ప డబ్బు కోసం నన్ను అనుభవించడం కోసం అస్తమానూ నా పడగ్గదిలోకి రాడు ఎప్పుడూ నన్ను అనుసరిస్తూనే ఉంటాడు పైవాళ్ళకు నా సెక్రటరీగా కన్పిస్తాడు

నీకంతా వింతగా ఉంది కదూ॥ నేను చెప్పే మాటల్ని బట్టి నేను సుఖపడలేక సుఖపడ్డంలేదు గానీ సుఖపడాలంటే పలానా విధంగా సుఖపడొచ్చు కదా అని అనేక ప్రశ్నలు నా మదిలో మెదులుతున్నాయి కదమ్మా?


దూరంనుండి కన్పిస్తున్న కొండ సాపుగా పచ్చని మెత్తని గడ్డిమొక్కల్తో మృదువుగానే కన్పిస్తుందమ్మా।

అది అంతే।

సారీ వసంతా। ఉత్తరం వ్రాస్తూ మరచిపోయి నా జీవితాన్ని వ్రాసేస్తున్నాను

చివరగా నువ్వడిగినా అడక్కపోయినా ఆచరించినా ఆచరించకపోయినా నీకో సలహా ఇస్తున్నానమ్మా నా దృష్టిలో ఇది అందమైన రంగులకల హాయిలో ఊయలలూగించే వానన గల మధురమైన మత్తుగల విషం వసంతా। దీన్ని త్రాగొద్దు

చదువుకొని ఆరోగ్యకరమైన విజ్ఞానాన్ని పెంపొందించుకొని ఒక మంచి వ్యక్తిత్వం గల మనిషికి నీ స్త్రీత్వాన్ని అర్పించుకొని అతన్ని జీవితాంతం ఆలంబనగా చేసుకొని అతనితో నీ జీవితాన్ని గృహిణిగా మాతృమూర్తిగా ఆనంధమయం చేసుకో అంతేగానీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ వైతరిణీ తీరానికి చేరాలని ఆశించొద్దు. ప్రయత్నించొద్దు।




ఉంటాను మయూరి

• • •

"వెండి తెరపై మరో మెరుపుతీగ

ఒక వనీవార పత్రికలో కన్పించిన పెద్ద పెద్ద అక్షరాలు మయూరిని ఆకర్షించాయి

ఆ అక్షరాల క్రింద పెద్ద ఫోటో

పరిశీలనగా చూసింది మయూరి

వసంత

వసంత వసంతమంత అందంగా ఉంది

వసంత కాలమంత ఆహ్లాదంగా ఉంది

గలగలా పారుతున్న యేరులా నవ్వుతూ ఉంది

మయూరికి నవ్వొచ్చింది తనలో తనే చిన్నగా సన్నగా బాధగా నవ్వుతుంది

ఆ తరువాత భారంగా నిట్టూర్చింది

ఆ నిట్టూర్పులో జరిగిపోయిన ఈ సంవత్సరంలో వసంత గురించి ఆలోచించి మరణించిన క్షణాల చితిమంటల చిటపటలు ఉన్నాయి

ఆ ఫోటో క్రింద వసంత గురించి ఆమె సినీ రంగప్రవేశం గురించి పది లైన్లు ఉన్నాయి

మయూరి వాటిని చదవలేదు